www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్ సంపుటి: 05 సంచిక: 301 శుక్రవారం 27-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు: 05 వెల : 5



భద్రగిరి మార్ట్‌లో గిరిజన సేంద్రియ ఉత్పత్తులు అద్భుతం

- **మార్ట్ ఏర్పాటుపై ఐటీడీఏ అధికారులను ప్రత్యేకంగా అభినందించిన సీఎం చంద్రబాబు నాయుడు**

భద్రాచలం, నవంబర్ 26 (భద్రాద్రిన్యూస్):-

భద్రాచలం పుణ్యక్షేత్రానికి విచ్చేసే భక్తులు, పర్యాటకులకు స్థానిక గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులు, గిరిజన రైతులు పండించే సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, గిరిజన మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతులకు ఆర్థిక చేయూత అందించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్ ఎంతో అద్భుతంగా ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు.

గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ భద్రగిరి మార్ట్‌లో లభించే వివిధ రకాల అటవీ, సేంద్రియ ఉత్పత్తులను పరిచయం చేసి అందజేశారు. మార్ట్‌లో ఏర్పాటు చేసిన ఉత్పత్తులను పరిశీలించిన ముఖ్యమంత్రి, ఈ వినూత్న ఏర్పాటుపై ఐటీడీఏ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు.

భక్తులు, పర్యాటకులు, సాధారణ ప్రజలకు అవసరమైన అనేక రకాల అటవీ ఉత్పత్తులు, నాణ్యమైన వస్తువులను ఒకే చోట అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని సీఎం పేర్కొన్నారు. గిరిజన మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసే ఉత్పత్తులు, గిరిజన రైతులు పండించే సేంద్రియ పంటలు, అటవీ ప్రాంతాల్లో లభించే సహజసిద్ధ ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ మిగతా 2వ పేజీలో..



పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను సహించేది లేదు..

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- **వేధింపులకు గురైన మహిళలు భయపడకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలి**
- **ప్రతి సంస్థలో పోష్ చట్టం–2013 ప్రకారం అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు తప్పనిసరి**
- **మహిళల ఆత్మగౌరవం కంటే ఉద్యోగం, డబ్బు, హోదా ముఖ్యం కాదు**
- **పోష్ చట్టం–2013పై జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ -26(భద్రాద్రిన్యూస్):-

పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను సహించేది లేదని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు. మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని సూచించారు.

గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన పోష్ చట్టం-2013 అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలు మిగతా 4వ పేజీలో..

విద్య, ఆరోగ్య సేవల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి: ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో

- **బ్రహ్మణపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బాలుర ఆశ్రమ పాఠశాలలో పీఓ తనిఖీ..**
- **వైద్య సేవలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, వసతులపై సమీక్ష**



3

చంద్రబాబు దంపతులకు ఘన స్వాగతం..

- **హెలిప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల ఆహ్వానం**
- **స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఏపీ సీఎం నారా చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు**



2

ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు!



- **డిసెంబర్ 19న గోదావరిలో తెప్పోత్సవం.. 20న ఉత్తర ద్వార దర్శనం**
- **భక్తుల సౌకర్యాలు, భద్రతకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి – కలెక్టర్ అంకిత్**

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 26 (భద్రాద్రిన్యూస్):

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ముక్కోటి మహోత్సవాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 10 నుంచి 30వ తేదీ వరకు అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా డిసెంబర్ 19న సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు గోదావరి నదిలో తెప్పోత్సవం, డిసెంబర్ 20న తెల్లవారుజామున 5 గంటలకు ఉత్తర ద్వార దర్శనం ప్రధాన ఘట్టాలుగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ మహోత్సవాలకు తరలివచ్చే భక్తులకు మిగతా 2లో..

భద్రగిరి మార్ట్‌లో గిరిజన సేంద్రియ ఉత్పత్తులు అద్భుతం

మొదటిపేజీ తరువాయి

అవకాశాలు కల్పించడం ద్వారా గిరిజన కుటుంబాలకు మెరుగైన ఆదాయ మార్గాలు ఏర్పడతాయని అన్నారు.

గిరిజనుల సంప్రదాయ ఉత్పత్తులకు తగిన గుర్తింపు కల్పిస్తూ, వారి నైపుణ్యాలను ప్రోత్సహించి జీవనోపాధిని మెరుగుపరిచే దిశగా భద్రగిరి మార్ట్ ఏర్పాటు చేయడం మంచి ఆలోచనగా అభివర్ణించారు. మార్ట్‌లోని ప్రతి ఉత్పత్తి నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను అందించడం సంతోషకరమని తెలిపారు.

ముఖ్యంగా భద్రగిరి మార్ట్ ప్రారంభమైన కేవలం ఏడు నెలల వ్యవధిలోనే మంచి వ్యాపార లావాదేవీలు సాధించడంతో పాటు, పర్యాటక శాఖ తరపున అవార్డు అందుకోవడం అభినందనీయమని సీఎం అన్నారు. మార్ట్ ఏర్పాటు, నిర్వహణలో కృషి చేసిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సంబంధిత అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.



గిరిజన యువతకు నైపుణ్య శిక్షణతో మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలి: ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో

- **ములుగు శిక్షణ కేంద్రంలో స్కిల్ ట్రైనింగ్ కోర్సుల పరిశీలన.. శిక్షణార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, సర్టిఫికెట్ల పంపిణీ**

ములుగు భద్రాద్రి న్యూస్

గిరిజన, గ్రామీణ ప్రాంతాల యువతకు నాణ్యమైన నైపుణ్య శిక్షణ అందించి, వారికి ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా శిక్షణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సంబంధిత అధికారులకు సూచించారు. ఈ మేరకు పీఓ ఆదేశాల ప్రకారం ఏపీఓ (జనరల్) రాంబాబు ములుగు మండల కేంద్రంలోని శిక్షణ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ నిర్వహిస్తున్న వివిధ నైపుణ్య శిక్షణ కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు.

ఈ సందర్భంగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, టైలరింగ్ కోర్సులకు సంబంధించిన శిక్షణ తరగతులను పరిశీలించారు. శిక్షణ పొందుతున్న యువతీ యువకులతో మాట్లాడి, వారికి అందుతున్న శిక్షణ, అభ్యాస విధానం, కోర్సుల ద్వారా కలిగే ఉపాధి అవకాశాల గురించి వివరాలు తెలుసుకున్నారు.

శిక్షణార్థులు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని, శిక్షణలో పూర్తి నైపుణ్యం సాధించాలని ఏపీఓ సూచించారు. శిక్షణ కేవలం సర్టిఫికెట్ పొందడానికే పరిమితం కాకుండా, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకొని ఉద్యోగాలు పొందేందుకు, స్వయం ఉపాధి ప్రారంభించేందుకు ఉపయోగపడాలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా అభ్యర్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అవసరమైన మార్గదర్శకత్వం, సహకారం అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. గిరిజన యువతలో ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి సరైన శిక్షణ, మార్గదర్శకత్వం అందించడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించేలా ఐటీడీఏ ప్రత్యేక దృష్టి సారిస్తోందని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో పేర్కొన్నారు. శిక్షణ కేంద్రాల్లో కోర్సుల నిర్వహణ, శిక్షణ నాణ్యత, అభ్యర్థుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేడీఎం కొండలరావు, ములుగు YTC సెంటర్ మేనేజర్ కొల్లూరి క్రాంతి కుమార్, శిక్షణ కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు!

మొదటిపేజీ తరువాయి

తాగునీరు, పారిశుధ్యం, రవాణా, విద్యుత్, భద్రత తదితర సౌకర్యాలు సమగ్రంగా కల్పించాలని అధికారులకు సూచించారు.

భద్రాచలం గ్రామపంచాయతీ పరిధిని 15 జోన్లుగా విభజించి, 16 మంది ఎంపీఓలు, 120 మంది పంచాయతీ కార్యదర్శులు, 300 మంది పారిశుధ్య కార్మికులతో మూడు షిఫ్టుల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలని ఆదేశించారు. 26 ప్రాంతాల్లో చలివేంద్రాలు, 155 మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. తెప్పోత్సవం, పుణ్యస్నానాల దృష్ట్యా గోదావరిలో నీటి మట్టాన్ని 6 నుంచి 6.5 అడుగుల మేర స్థిరంగా ఉంచడంతో పాటు స్నాన ఘట్టాల వద్ద బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, మత్స్యశాఖ సమన్వయంతో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

ఉత్సవాల సమయంలో 24 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా 25 మంది సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, కరకట్ట, బ్రిడ్జి ప్రాంతాల్లో 250 ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హంసవాహనం వద్ద, ప్రతి సెక్టార్‌లో అగ్నిమాపక సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు రెండు వాటర్ టెండర్లను సిద్ధం చేయాలని పేర్కొన్నారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని డిసెంబర్ 19 తెల్లవారుజాము నుంచి 21వ తేదీ మధ్యాహ్నం వరకు టీజీఎస్ ఆర్టీసీ ద్వారా 80 ప్రత్యేక బస్సులు నడపాలని, ఆటోలు, మ్యాజిక్ వాహనాలు అధిక ఛార్జీలు వసూలు చేయకుండా గరిష్ఠ ఛార్జీల పట్టికలను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హోటళ్లు, దుకాణాల్లో ఆహార నాణ్యత, ధరలను ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీ చేయాలని సూచించారు.

తప్పిపోయిన పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ, ప్రైవేట్ వసతి సదుపాయాలు, ప్రోటోకాల్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వారం రోజుల తర్వాత భద్రాచలంలో నిర్వహించే క్షేత్రస్థాయి సమీక్షా సమావేశానికి అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

పటిష్ఠ పోలీసు బందోబస్తు.. ట్రాఫిక్ నియంత్రణ

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో గత ఏడాది కంటే ఈసారి భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా పటిష్ఠ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రధాన రహదారుల వెంట బారికేడింగ్ ఏర్పాటు చేయడంతో పాటు వీఐపీల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక మార్గాలను రూపొందిస్తామన్నారు. వాహనాల పార్కింగ్ కోసం ముందుగానే స్థలాలను గుర్తించి చదును చేయించాలని, రహదారులపై వాహనాల నిలుపుదల వల్ల సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల కోసం క్రేన్లు, టోయింగ్ వాహనాలను సిద్ధంగా ఉంచుతామని తెలిపారు.

ఉత్తర ద్వారం వద్ద 8 సెక్టార్లు..

టికెట్లకు ప్రత్యేక ఏర్పాట్లు

భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ ఉత్తర ద్వారం ఎదుట భక్తుల సౌకర్యార్థం మొత్తం 8 సెక్టార్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటిలో వీఐపీ, న్యాయశాఖ, మీడియా గ్యాలరీలకు ప్రత్యేక బ్లాక్‌లు కేటాయిస్తున్నట్లు వివరించారు. ఆలయ అభివృద్ధి పనుల కారణంగా సెక్టార్ల సామర్థ్యంలో స్వల్ప మార్పులు ఉన్నాయని పేర్కొన్నారు.

సామాన్య భక్తుల కోసం 75 శాతం టికెట్లను ఆన్‌లైన్ ద్వారా, 25 శాతం టికెట్లను స్థానిక భక్తులకు అందుబాటులో ఉండేలా సబ్ కలెక్టర్ కార్యాలయం, ఆలయ పరిసరాల్లోని ఐదు కౌంటర్ల ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణ పనుల దృష్ట్యా ఈసారి స్వామివారి ఊరేగింపు పశ్చిమ రాజగోపురం నుంచి ర్యాంప్ మీదుగా సాగేలా దేవాదాయ, ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. గత ఏడాది ఎదురైన లోటుపాట్లను సరిదిద్దుతూ అన్ని శాఖల అధికారులకు స్పష్టమైన విధుల కేటాయింపు ఉత్తర్వులు జారీ చేసి మహోత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, దేవస్థానం ఈవో దామోదర్ రావు, కొత్తగూడెం ఆర్డీవో మధు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.





చంద్రబాబు దంపతులకు ఘన స్వాగతం..

- **నవభారత్ వెంకటేశ్వర స్వామి దర్శనం**
- **హెలిప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల ఆహ్వానం**
- **స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఏపీ సీఎం నారా చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు**

కొత్తగూడెం, నవంబర్ 26 (భద్రాద్రిన్యూస్):

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఘన స్వాగతం లభించింది. హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, వైరా ఎమ్మెల్యే రామదాస్ నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్యమంత్రి దంపతులకు పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా స్వాగతం పలికారు.



అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజులతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరి దంపతులు నవభారత్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా ముఖ్యమంత్రి దంపతులకు స్వాగతం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





విద్య, ఆరోగ్య సేవల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి: ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో

- **బ్రహ్మణపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బాలుర ఆశ్రమ పాఠశాలలో పీఓ తనిఖీ.. వైద్య సేవలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, వసతులపై సమీక్ష**

బ్రహ్మణపల్లి: భద్రాద్రి న్యూస్

గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య, పౌష్టికాహారం, అవసరమైన వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో గురువారం బ్రహ్మణపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (PHC), బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల (AHS)లను సందర్శించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ:

ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన పీఓ, ఫార్మసీ, మందుల నిల్వ గదిని పరిశీలించారు. కేంద్రంలో అందుబాటులో ఉన్న మందుల వివరాలు, వాటి నిల్వలు, అవసరమైన మందుల లభ్యత, స్టాక్ రిజిస్టర్ నిర్వహణను తనిఖీ చేశారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు.

అనంతరం సిబ్బంది హాజరు రిజిస్టర్, ఇన్‌పేషెంట్ (IP), ఔట్‌పేషెంట్ (OP) రిజిస్టర్లను పరిశీలించి, రికార్డుల నిర్వహణ తీరును సమీక్షించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు అందించే వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

బాలుర ఆశ్రమ పాఠశాలలో

విద్యా ప్రమాణాల పరిశీలన:

అనంతరం బ్రహ్మణపల్లి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించిన పీఓ, పదో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువు, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించి, వారి పఠన, లేఖన నైపుణ్యాలను స్వయంగా పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధమయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.



విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, పరిమాణం మెనూ ప్రకారం ఉంటున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వేళల్లో విద్యార్థులకు ఆటలు, క్రీడా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారా అని ఆరా తీశారు. విద్యతో పాటు శారీరక దృఢత్వం, క్రీడా నైపుణ్యాల అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

అలాగే విద్యార్థుల బ్యాంకు ఖాతాల ప్రారంభం, వాటికి సంబంధించిన వివరాలను పోర్టల్‌లో రోజువారీగా నమోదు చేసి అప్‌డేట్ చేస్తున్నారా అనే అంశంపై ప్రధానోపాధ్యాయుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల బ్యాంకు ఖాతాల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, FRS హాజరు నమోదు ప్రక్రియను పోర్టల్‌లో పూర్తిచేసి, వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మెరుగైన వసతులు అందేలా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రగతి, ఆరోగ్య సేవల నాణ్యతపై ఐటీడీఏ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని తెలిపారు.



నర్సింగ్ ఆఫీసర్లు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- **డాక్టర్ చంద్రశేఖర్**

భద్రాద్రి న్యూస్ ములుగు:

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఏకంగా 119 నర్సింగ్ ఆఫీసర్లు నియామకం కావడంతో మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవకాశం లభించిందని, నర్సింగ్ ఆఫీసర్లు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల సూపర్డెంట్ డాక్టర్ వి.చంద్ర శేఖర్ అన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నియామకమైన నర్సింగ్ ఆఫీసర్లకు బ్యాడ్జింగ్ , క్యాపింగ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున నియామకాలు నిర్వహించి ఇక్కడి ఆసుపత్రికి కేటాయించడం వైద్య రంగంలో చారిత్రాత్మక మైలురాయి అని అభివర్ణించారు.

ములుగు జిల్లా వైద్యారోగ్య చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి నాందిగా నిలిచిపోతుందని, వార్డులు, అత్యవసర ట్రామా విభాగాలు, ఆపరేషన్ థియేటర్లు, క్రిటికల్ కేర్ విభాగాలలో రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వీరి పాత్ర ఎంతో కీలకమని అన్నారు.

నర్సింగ్ ఆఫీసర్లు రోగుల పట్ల ఓర్పు, కరుణ, అప్రమత్తత మరియు వృత్తిపరమైన నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు.

కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్‌ఛార్జ్ చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ పి. బేబీ సరళ, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్లు పి. రమాదేవి, ఎ. యాకమ్మ, నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.





శ్రీ రాగా హైస్కూల్‌లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

- **విద్యార్థులకు ఉపన్యాసాలు, క్విజ్ పోటీలు.. విజేతలకు బహుమతుల ప్రదానం**

కొత్తగూడెం నవంబర్ 26 (భద్రాద్రి న్యూస్):

కొత్తగూడెం మేదరబస్తీలోని శ్రీ రాగా ప్లే అండ్ హైస్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మల్లారపు వరప్రసాద్ డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఉపన్యాస పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు కరస్పాండెంట్ మల్లారపు వరప్రసాద్ బహుమతులు అందజేసి అభినందించారు.



భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలు, పౌరుల హక్కులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మల్లారపు కవిత, ఉపాధ్యాయులు రాంబాబు, మహాలక్ష్మి, స్వాతి రెడ్డి, చరిత శ్రీ, అఖిల, రజిని తదితరులు పాల్గొని విద్యార్థులకు రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించారు.

విద్యార్థుల్లో విజ్ఞానం, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్య విలువలు పెంపొందించేందుకు పాఠశాలలో ఇలాంటి విజ్ఞానదాయక కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని కరస్పాండెంట్ వరప్రసాద్ తెలిపారు.

భారత రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలి

- **రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ బాధ్యతలను నిర్వర్తించాలి**
- **జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, ఎం. సంపత్ రావు**

భద్రాద్రి న్యూస్ ములుగు

భారత రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవరచుకొని, రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ తమ విధులు, బాధ్యతలను నిర్వర్తించాలని జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, ఎం. సంపత్ రావు అన్నారు.

గురువారం భారత రాజ్యాంగ దినోత్సవం సంవిధాన్ దివస్ పురస్కరించుకొని జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులతో కలిసి భారత రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించగా, 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చిందని తెలిపారు. రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2015 నుంచి ప్రతి సంవత్సరం నవంబర్ 26న భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

భారత రాజ్యాంగంలోని మూల సూత్రాలు, ఆశయాలు, విలువలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవడంతో పాటు వాటిని ఆచరణలో పాటించాలని సూచించారు. రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి ఆదర్శాలను గుర్తుచేసుకుంటూ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.





అంబేద్కర్ ఆశయాలే స్ఫూర్తిగా.. త్రివేణిలో రాజ్యాంగ దినోత్సవం

- **బాలల హక్కులు, ప్రాథమిక హక్కులు–విధులపై విద్యార్థులకు అవగాహన.. రాజ్యాంగ పీఠికతో ప్రతిజ్ఞ**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 26(భద్రాద్రి న్యూస్):-

త్రివేణి పాఠశాలలో జాతీయ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ రూపశిల్పి డా. బి.ఆర్. అంబేద్కర్‌కు ఘన నివాళులర్పిస్తూ, విద్యార్థులకు బాలల హక్కులు, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, పౌరుల విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేశారు.

రాజ్యాంగంలోని ప్రధాన అంశాలు, ప్రజాస్వామ్య విలువలను ప్రతిబింబించేలా విద్యార్థులు రూపొందించిన చార్టులను ప్రదర్శించారు. స్కిట్ల ద్వారా ప్రాథమిక హక్కులు, విధుల ప్రాముఖ్యతను వివరించారు.



రాజ్యాంగ అంశాలపై ప్రసంగాలతో పాటు నృత్య ప్రదర్శనలు నిర్వహించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి హక్కులతో పాటు బాధ్యతలను కూడా కల్పించిందని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే రాజ్యాంగ విలువలు, హక్కులు, విధులపై అవగాహన పెంపొందించుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, సి.ఆర్.ఓ. కాట్రగడ్డ మురళీకృష్ణ, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యల పరిష్కారానికి అధికారులకు వినతి

- **పెరిగిన ధరలకు అనుగుణంగా నూతన మెనూ అమలు చేయాలి**
- **హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపర్చాలి.. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 26 (భద్రాద్రి న్యూస్)



:ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా నూతన మెనూను అమలు చేయాలని కోరుతూ తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం (టి.హెచ్.డబ్ల్యు.ఓ.ఎస్) ఖమ్మం జిల్లా నాయకులు గురువారం సంబంధిత జిల్లా అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు.

ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ (ఎఫ్ఏసీ), బీసీ సంక్షేమ శాఖ డీబీసీడీఓ శ్రీమతి గుడికందుల జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ ఫిరంగి గార్లకు వినతిపత్రాలు అందజేశారు.

నాకాఫ్ టెండర్ ధరలు, జిల్లా స్థాయి టెండర్ ధరలను పరిగణనలోకి తీసుకుని రూపొందించిన 2026-27 నూతన మెనూను జిల్లా కలెక్టర్ ఆమోదంతో డిసెంబర్ 1వ తేదీ నుంచి అమలు చేయాలని ఫోరం నాయకులు కోరారు. పెరిగిన ధరల నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించేందుకు నూతన మెనూ అమలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.

హాస్టళ్లలో అత్యవసర మరమ్మతులు చేపట్టాలని, సీసీ కెమెరాలను మరమ్మతు చేయించాలని, మెస్ డోర్లు ఏర్పాటు చేయాలని, భవనాలకు రంగులు వేయించాలని కోరారు. పెండింగ్ మెయింటెనెన్స్ బిల్లులను విడుదల చేయడంతో పాటు అవసరమైన నిధులు, సామగ్రిని హాస్టల్ స్థాయికి అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల భోజనం, ఆరోగ్యం, భద్రత, సంక్షేమ బాధ్యతలతో పాటు ముఖ గుర్తింపు హాజరు వ్యవస్థ పర్యవేక్షణను కూడా వసతి గృహ సంక్షేమ అధికారులు నిర్వహిస్తున్నారని, ఈ నేపథ్యంలో వారిపై అదనపు విధుల భారాన్ని తగ్గించాలని కోరారు. ప్రతి హాస్టల్‌కు ముఖ గుర్తింపు హాజరు నమోదుకు ప్రత్యేక మొబైల్ పరికరం, నిరంతర ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

హాస్టళ్ల సమస్యలు కేవలం నిర్వహణ అంశాలే కాకుండా విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమంతో ముడిపడి ఉన్నాయని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి పెండింగ్ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పరిష్కరించాలని ఫోరం నాయకులు కోరారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు, కార్యదర్శి నెల్లూరి నాగేశ్వరరావు, ఫోరం నాయకులు బజ్జూరి వెంకటేశ్వరరావు, పి.హనుమంతరావు, ఎస్.వెంకటరెడ్డి, కె.వీరభద్రరావు, కె.వెంకటేశ్వరరావు, ఐ.జ్యోత్స్న, కె.రమాదేవి, సిహెచ్.నాగమణి, యం.బాలు, బాలాజీ, నరసింహారావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను సహించేది లేదు..

మొదటిపేజీ తరువాయి

ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు అనేక సందర్భాల్లో బయటకు రావడం లేదని అన్నారు. ఫిర్యాదు చేస్తే వివిధ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందనే భయం, ఇతర కారణాలతో చాలా మంది బాధిత మహిళలు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదని తెలిపారు. మహిళలు వేధింపులను మౌనంగా భరించకుండా, తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు.

మన ఇంట్లో చెత్తబుట్ట ఉన్నట్లే సమాజంలో కూడా చెడు ఆలోచనలు కలిగిన వ్యక్తులు ఉంటారని, అలాంటి వ్యక్తుల వేధింపులను ఏమాత్రం సహించకూడదని కలెక్టర్ అన్నారు. మహిళలు ఎదుర్కొనే వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు ఒక్క క్షణం ధైర్యం సరిపోతుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ వేధింపులను భరించవద్దని స్పష్టం చేశారు. పోష్ చట్టం ప్రకారం 10 మంది లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేసే ప్రతి సంస్థలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ (Internal Complaints Committee - ICC) తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. పని ప్రదేశాల్లో మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రతి సంస్థ బాధ్యత అని పేర్కొన్నారు.

మహిళలు వేధింపులపై ఫిర్యాదు చేయని పక్షంలో నిందితులు తప్పించుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ అన్నారు. వేధింపులకు గురైన వెంటనే ఫిర్యాదు చేయాలని, ఆలస్యం చేస్తే నిందితులు వివిధ కారణాలు చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తారని తెలిపారు. తాము స్నేహపూర్వకంగానే మాట్లాడామని, తమ ప్రవర్తన వేధింపులుగా భావిస్తారని తెలియదని, బాధితులు వెంటనే ఫిర్యాదు చేయలేదని వంటి కారణాలతో తప్పించుకునేందుకు ప్రయత్నిస్తారని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన అనంతరం కూడా కొంత మంది బాధిత మహిళలపై రాజీ పడాలని ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇలాంటి చర్యల వల్ల నిందితులకు తగిన శిక్ష పడకపోవడమే కాకుండా భవిష్యత్తులో ఇతర మహిళలు కూడా వేధింపులకు గురయ్యే ప్రమాదం ఉందని కలెక్టర్ తెలిపారు. బాధిత మహిళలు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టపరమైన పరిష్కారం పొందాలని సూచించారు.

పోష్ చట్టం-2013 ప్రధాన ఉద్దేశం పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమేనని, ఒకవేళ అనుకోని పరిస్థితుల్లో వేధింపులు జరిగినట్లయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మహిళల ఆత్మగౌరవం కంటే ఉద్యోగం, డబ్బు, హోదా ఏవీ ముఖ్యమైనవి కావని పేర్కొన్నారు. అదే సమయంలో పోష్ చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ కొంతమంది తప్పుడు సమాచారంతో తప్పుడు ఫిర్యాదులు నమోదు చేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా, వాస్తవాల ఆధారంగా న్యాయబద్ధమైన విచారణ జరగాలని పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై ఎలాంటి వేధింపులకూ తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. మహిళా సాధికారత కేంద్రాల నుంచి పూర్తిస్థాయి సహకారం తీసుకుంటూ మహిళల భద్రత, హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని, వేధింపులకు గురైన మహిళలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు సూచించారు. మహిళలకు గౌరవ ప్రదమైన, సురక్షితమైన పని వాతావరణం కల్పించేందుకు అన్ని సంస్థలు, శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, సిడిపిఓ విష్ణువందన, డి.హెచ్.ఈ.డబ్ల్యూ.సమ్రీన్, సంబంధిత అధికారులు, మహిళలు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.





ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ (బి), ఖమ్మంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 26 (భద్రాద్రిన్యూస్):-

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ (బి), ఖమ్మంలో వసతి గృహ సంక్షేమ అధికారి కోటపాటి రుక్మారావు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో భారత రాజ్యాంగ ప్రవేశికను సామూహికంగా చదివించారు. అనంతరం భారత రాజ్యాంగ ప్రాముఖ్యత, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, పౌరుల బాధ్యతలు, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ విలువల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఈ సందర్భంగా సూచించారు.





జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రెజొనెన్స్ విద్యార్థుల పతకాల పంట

- **బంగారు, వెండి పతకాలతో సత్తా..**
- **విద్యార్థులను అభినందించిన పాఠశాల యాజమాన్యం**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 26 (భద్రాద్రి న్యూస్):-

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఖమ్మం వీ.డి.వోస్ కాలనీలోని రెజొనెన్స్ ఇన్ఫో స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలు సాధించారు. ఓరుగల్లు వొకినావా మార్షియల్ ఆర్ట్స్ అకాడమీ, జపాన్ కరాటే షోటోకాయ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాఠశాల విద్యార్థులు విజయం సాధించినట్లు డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ పోటీల్లో 5వ తరగతి విద్యార్థులు ఎ. పూర్విక, ఎం. కావ్యశ్రీ, ఎం. వివేక్ జైన్, జి. రోహిత్ మానో, 2వ తరగతి విద్యార్థి పి. జ్ఞాపిక, 7వ తరగతి విద్యార్థి ఎ. చరణ్ బంగారు పతకాలు సాధించి ప్రతిభ చాటారు. 3వ తరగతి విద్యార్థులు ఎం.డి. జోహేరా, ఎం. చాణిక్య వెండి పతకాలను కైవసం చేసుకున్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ విద్యార్థులు చురుకుగా పాల్గొంటూ తమ ప్రతిభను చాటుతున్నారని డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ పేర్కొన్నారు.

విద్యార్థుల విజయంపై డైరెక్టర్లు కొండా శ్రీధర్, నీలిమ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ టి. గోపాలకృష్ణ హర్షం వ్యక్తం చేసి, విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాం

